# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 01-09-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమంలో ఈరోజు పాల్గొంటారు.**

**2. తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యానికి అంతర్జాతీయ భాగస్వామ్యాలు మరింత దోహదం చేస్తాయని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.**

**3. గ్రామీణ ప్రాంతాల్లోనూ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.**

**4. ఆక్వా కాలుష్య నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు.**

============================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పశ్చిమ గోదావరి జిల్లాలో ఈరోజు పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా పొన్నపల్లిలో నిర్వహించే ఎన్టీఆర్ భరోసా పింఛను లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించి నగదు పంపిణీ చేస్తారు. అనంతరం ప్రజావేదికలో జరిగే సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తారు.. తర్వాత నరసాపురం నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ సమావేశంలో పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అధికారులు తెలిపారు.

-------------------------

అమెరికా, బ్రిటన్‌లకు చెందిన ప్రముఖ విదేశీ విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అమెరికా, బ్రిటన్‌లలో పర్యటించిన తెలంగాణ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం.. ఈ ఒప్పందాలకు సంబంధించిన ప్రత్యేక నివేదికను ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డికి నిన్న అందజేసింది. నివేదికను స్వీకరించిన రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంతో తెలంగాణ విద్యార్థులు, యువతకు హైదరాబాద్‌లోనే ప్రపంచస్థాయి విద్య, నైపుణ్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యానికి విదేశీ పర్యటనలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలు మరింత దోహదం చేస్తాయని పేర్కొన్నారు.

-------------------------

గ్రామీణ ప్రాంతాల్లోనూ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పెదనందిపాడులో ఆర్థిక సంఘ నిధులతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనానికి కేంద్రమంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ ఆరోగ్య కేంద్రాల్లో ఆపరేషన్ థియేటర్, ప్రయోగశాల, ఫార్మసీ, టీకా వేసే సదుపాయాలను ఏర్పాటు చేయనున్నామని తెలియజేస్తూ,

వాయిస్..30..సెకన్లు

---

ప్రజల అభిప్రాయాల ఆధారంగా పౌర సేవలను మరింత మెరుగుపరచాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్-ఆర్టీజీఎస్ పై సంబంధిత అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, మహిళలపై నేరాలు, గంజాయి నియంత్రణ, పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో పరిశుభ్రత, ఆహారం, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ ధృవ పత్రాలు అన్నీ ఆన్‌లైన్‌లో జారీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుత నీటి వనరులను సద్వినియోగం చేసుకుని ఉద్యాన పంటలను సాగులోకి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

---

ఆక్వా కాలుష్య నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆయన ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఆక్వా ప్రాసెసింగ్ కేంద్రాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఆక్వా కేంద్రాల్లోని నీటి విడుదల వ్యవస్థల నుంచి నమూనాలు సేకరించి ప్రయోగశాలలకు పంపించారు. ఆక్వా కేంద్రాల్లో వ్యర్థాల నిర్వహణను పరిశీలించడంతో పాటు, కాలుష్య నివారణ చర్యలపై యాజమాన్యాలకు అవగాహన కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

---

గ్రామాలు అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన నిన్న ప్రారంభించారు. ఇందులో భాగంగా చల్లచింతలపూడి-కంద్రిగ నరసింహాపురం రహదారి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. చల్లచింతలపూడి స్మశానవాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని ఆయన తెలుపుతూ...

వాయిస్..25.. సెకన్లు

---

తెలంగాణలో రైతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పిస్తున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురంలో

60 ఏళ్లుగా పరిష్కారం కాని అసైన్డ్ భూముల సమస్యను భూ భారతి రీ-సర్వే ద్వారా పరిష్కరించినట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా 780 మంది రైతులకు 1,378 ఎకరాలకు సంబంధించిన భూ ఆధార్, పట్టాదార్ పాస్ పుస్తకాలను ఆయన నిన్న పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాన్ని భూ వివాదాలు లేని తెలంగాణగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ప్రతీ అంగుళం భూమిని సర్వే చేసి, క్యూఆర్ కోడ్, మ్యాప్‌తో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులు, భూ యజమానులకు అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు.

--------------------------

రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో 8 కోట్ల 71 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఆత్మకూరు ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. సంగం నుంచి కలిగిరికి వెళ్లే మార్గంలో దెబ్బతిన్న ఐదు కిలోమీటర్ల రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే ఆత్మకూరు-సోమశిల రహదారిని ఐదు కోట్ల రూపాయలతో ఆధునీకరించనున్నట్లు వెల్లడించారు.

--------------------------

ఉత్తర తీర ఒడిశా, వాయువ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడన ప్రస్తుతం ఆగ్నేయ దిశగా కదులుతూ తూర్పు మధ్య బంగాళాఖాతం వైపు పయనించనుందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ జిల్లాల్లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

తెలంగాణలోనూ రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల, విశాఖపట్నంలోని ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిన్న నిర్వహించారు. జూ ప్రాంగణాలను పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దడంతో పాటు జంతువులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం, సందర్శకులకు మెరుగైన అనుభూతిని అందించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. జంతు ప్రదర్శనశాలలు కేవలం వినోద కేంద్రాలుగా కాకుండా వన్యప్రాణుల సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ అవగాహనకు కేంద్రాలుగా నిలవాలని పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. జంతు ప్రదర్శనశాలల్లో క్రమం తప్పకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

====================